క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకే ముస్లింల మద్దతు



సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే సంజీవయ్యను కలిసిన డాక్టర్ పర్వీన్

నాయుడుపేట టౌన్: ముస్లిం మైనారిటీలంతా వైఎస్సార్ సీపీకే మద్దతుగా ఉంటారని కడపకు చెందిన రూ.10కే వైద్యం చేసే డాక్టర్ పర్వీన్ పేర్కొన్నారు. నాయుడుపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంజీవయ్యను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ ముస్లింల సంక్షేమానికి ఎనలేని కృషి చేయడమే కాకుండా నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుభావుడన్నారు. ఆయన కుమారుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అదే బాటలో నడుస్తూ ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కడప పట్టణంలో డాక్టర్‌గా కేవలం 10 రూపాయలకు వైద్యం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న పర్వీన్ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ముస్లింలను కలసి ప్రచారం చేసేందుకు ముందుకు వచ్చి మద్దతు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, మెస్ భాస్కర్‌రెడ్డి, దారా రవి, రాహుల్, వెంకటేశ్వర్లు, ముస్లిం నాయకులు కింగ్స్‌వే జిలాని, అన్నమేటి చంద్రారెడ్డి, మీజూరు బాల, సాధు మోహన్ ఉన్నారు.

నేడు సైదాపురంలో వైఎస్సార్ సీపీ ప్రచారం

సైదాపురం: వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో రోడ్‌షోలు, ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు తెలిపారు. మండలంలోని దేవరవేమూరు, కట్టబడిపల్లి, తురిమెర్ల, గిద్దలూరు, ఊటుకూరు, ఆదూరుపల్లి గ్రామాల్లో రోడ్ షో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజా ప్రతినిధులతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

చెంగాళమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు



స్వర్ణకిరీటం, చందనాలంకారంతో చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు

సూళ్లూరుపేట: కాళంగి నదీతీరాన వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నూతన తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అంబళ్లు పోసి ఉగాది పచ్చడిని అందరికి పంచిపెట్టారు. మంగళవారం అమ్మవారి మూలవిరాట్టుకు స్వర్ణ కిరీటం, చందనాలంకరణతో చెంగాళమ్మ నిజరూప దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా అమ్మవారి నిజరూప దర్శనాన్ని దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

ఓజిలి: పండ్లూరు జాతీయ రహదారిపై ఉన్న కిన్నెర హోటల్‌లో ఓజిలి మండల వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరవుతారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలు, సలహాలు తెలియజేస్తారన్నారు. ఓజిలి మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యేను మూడో సారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీలో కష్టపడి పనిచేసిన నాయకులకు సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. ఈ ఆత్మీయ సమావేశానికి మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

సైదాపురం: మండలంలోని పాలూరు గ్రామానికి చెందిన సుదలగుంట సుందరయ్య వద్ద నుంచి 10 మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం అనుమతి లేకుండా 10 మద్యం బాటిళ్లు కలిగి ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు



చిల్లకూరు: మల్లాం ఆలయం వద్ద మేరిగ మురళీధర్ తదితరులు

నాయుడుపేట టౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను నాయుడుపేట మండలంలో ప్రజలు, భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు బారులుతీరి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అంబలి పంపిణీ చేశారు. భగవతి మల్లికాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఒట్టూరు కిషోర్‌యాదవ్, కలికి మాధవరెడ్డి, ఆలయ నిర్వాహకులు రామనారాయణ, గూడూరు సుధీర్‌రెడ్డి పాత బస్టాండు వద్ద అన్నదానం, పండ్లు పంపిణీ చేపట్టారు. బ్రాహ్మణవీధిలో ఉన్న వళ్లీదేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపాలపురంలో ఉన్న రామాలయం వద్ద నుంచి భక్తులు 108 కేజీల కుంకుమ కలశాలతో ఊరేగింపుగా సుబ్రమణ్యేశ్వ స్వామి ఆలయం వద్దకు చేరుకుని కుంకుమతో అభిషేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం జరిపారు. పట్టణంలోని అంకమ్మ మానసదేవి (నాగమాసలమ్మ) ఆలయాల వద్ద ఉగాది పూజలు చేపట్టారు. రాత్రి అమ్మవారి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మాజికండ్రిగ స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నరసారెడ్డికండ్రిగ మహాలక్ష్మమ్మ దేవస్థానంలో కలశ ప్రతిష్ఠ చేపట్టారు. బేరిపేట మహాలక్ష్మమ్మ ఆలయం, మూకాంబిక ఆలయం, తుమ్మూరు ఆలయాల్లో ఉగాది వేడుకలు చేపట్టారు. అగ్రహారపేట ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం పుష్పార్చన, బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

ఉగాది వేడుకల్లో ఎమ్మెల్సీ మేరిగ

చిట్టమూరు(చిల్లకూరు): శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లాంలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ పాల్గొన్నారు. మల్లాంలోని శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు నాయకులు మేరిగకు అపూర్వ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్‌రెడ్డి, వైఎస్ఆ సీపీ నాయకులు దువ్వూరు శేషురెడ్డి, బాబు రెడ్డి తదితరులు ఉన్నారు.

సైదాపురంలో ఉగాది వేడుకలు

సైదాపురం: క్రోధినామ సంవత్సరం పేరుకు సార్థకత చేకూర్చేలా అన్నివర్గాల ప్రజలకు కొత్త ఏడాదిలో విజయాలు జరగాలని అన్నీ దేవాలయాల్లో ఉగాది సందర్భంగా మంగళవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఉన్న శ్రీసిద్ధలయ్య కోనలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సైదాపురం, తురిమెర్ల, గిద్దలూరు, కలిచేడు, చాగణం గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు. అలాగే సైదాపురంలో ఉన్న శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో వైభవంగా ఉగాది వేడుకలు నిర్వహించారు

ఆలయాల్లో ఉగాది వేడుకలు

చిల్లకూరు: శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను పలు ఆలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తీర ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు ముత్యాల చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలకు చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన దర్భి దర్గా అశోక్‌కుమార్, సౌమ్య దంపతులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. భారీ అన్నదానం నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయ చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ, గూడూరు ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాం ఆలయంలో ఉగాది శోభాయాత్ర

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని మల్లాంలో వెలసియున్న శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని సకల దేవతామూర్తులకు వాహన సేవ, గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. ట్రాక్టర్‌లపై గ్రామోత్సవం, అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఊరంతా ఉగాది ఉషస్సులు

వాకాడు: తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేపట్టారు. వాకాడు నాగార్పమ్మవారి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చల్లని రాగి అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు.

మయూరం అలంకరణలో కోటమ్మ

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో మంగళవారం శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారు నెమలి పింఛాలతో మయూరం అలంకరణ చేసి, భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. వేదపండితులు సుధాకర్ శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు.



నాయుడుపేటలో అన్నదానం



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధేశ్వర స్వామివారు

జగనన్ననే మళ్లీ సీఎం చేసుకుందాం



మల్లమ్మగుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

– ప్రత్యేక పూజలు నిర్వహించిన నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మేలు చేసిన జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉగాది పండుగ సందర్భంగా వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, బీసీ నేత బొలిగర్ల మస్తాన్‌యాదవ్ వెంకటగిరిలోని పలు ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లమ్మగుడి వీధిలోని మల్లమ్మతల్లి, రంగయ్యశెట్టి ఆలయంలో పూజలు చేపట్టారు. భారీ అన్నదాన కార్యక్రమాన్ని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వెంకటగిరి గ్రామశక్తి శ్రీపోలేరమ్మ తల్లి ఆలయం వద్ద రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలనికోరారు. మున్సిపల్ చైర్మన్ నక్కా భానుప్రియ, దొంతుశారద, జి.ఢిల్లీబాబు, పులి ప్రసాద్‌రెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, చిట్టేటి హరికృష్ణ, ఎల్.కోటేశ్వరరావు ,సీహెచ్ ఉమామహేశ్వరి, ఎస్.బాలయ్య, మాడా జానకిరామయ్య, యస్దానిబాషా, కౌన్సిలర్లు, సుబ్బారావు, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, ధనియాల రాధ, కందాటి కళ్యాణి, వహిద పాల్గొన్నారు.



మల్లమ్మగుడి వద్ద భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

సంక్షేమ పాలనకే పట్టం కడుదాం



సోమసానిగుంటలో వైఎస్సార్ సీపీ ప్రచారం

వెంకటగిరి రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి... సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకే ప్రజా తీర్పుతో పట్టం కడుదామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని సోమసానిగుంట పంచాయతీలో మంగళవారం వైఎస్సార్ సీపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎం.వెంకటేశ్వర్లు, మాజీ మండల అధ్యక్షుడు ఆవుల గిరియాదవ్, మాజీ సర్పంచ్ తిరుమల, నాయకులు నక్కల పోలయ్య, మురళీ, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, నారాయణయాదవ్, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా...



కటాలమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు కొడుతున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్: గూడూరు నియోజకవర్గంలోని ప్రజలతో ఇప్పటికే తనకు ఎంతో అనుబంధం ఉందని, వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరులో మంగళవారం భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి గూడూరు నియోజకవర్గంలో ప్రతి గడపకు వెళ్లి పలకరించానని అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలు మరచి పోకుండా ప్రచారానికి వెళ్లిన సమయంలో వారు సాదరంగా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి సీఎంగా గెలిపించుకునే క్రమంలో ప్రతి ఒక్కరు ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అనంతరం ఉగాదిని పురస్కరించుకుని చెన్నూరులో వెలసిన కటాలమ్మ ఆలయం ఆవరణలో 200 కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి, తిరుపతి జిల్లా జేసీఎస్ కన్వీనర్ ఎల్లంటి సనత్‌కుమార్, సతీష్‌రెడ్డి, రాజేష్ యాదవ్, కటికాల శేషగిరి, ముప్పాల చంద్రమోహన్ రెడ్డి, గారా వంశీ తదితరులు పాల్గొన్నారు. చిట్టమూరు మండలంలోని మెట్టు, ఈశ్వరవాక, ఆలేటిపాడు గ్రామాలలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ప్రచార కార్యక్రమాలను చేపట్టి, పలువురు నాయకులను కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేదురుమల్లికి శుభాకాంక్షల వెల్లువ



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

వెంకటగిరి రూరల్: క్రోధినామ సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వార్డు కౌన్సిలర్లు, బాలాయపల్లి మండలం అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెందోటి కార్తీక్‌రెడ్డి తదితరులు ఆయన నివాసం వద్దకు చేరుకుని నేదురుమల్లికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దొరవారిసత్రం: మండలం పరిధిలో పలు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక మొత్తంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. నెలబల్లి, శ్రీధనమల్లి, ఉచ్చూరు, మేలుపాక, నేలపట్టు, పూలతోట, పాళెంపాడు, ఏకొల్లు తదితర గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కండలేరులో 7.879 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 7.879 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 250 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ

వెంకటగిరి రూరల్: అనారోగ్యానికి గురై ఇంటి వద్దనే ఉన్న మల్లమ్మగుడి ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కాటబత్తిన చిరంజీవిని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట వెంకటగిరి రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర, బీసీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్ ఉన్నారు.

50 మద్యం సీసాలు పట్టివేత

దొరవారిసత్రం: ఉచ్చూరులో మద్యం అమ్ముతున్న బెల్టు దుకాణంపై మంగళవారం రాత్రి ఎస్ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 50 మద్యం సీసాలతో పాటు బెల్టు దుకాణం నిర్వాహకుడు కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిర్వాహకుడితో పాటు మద్యం సీసాలను బుధవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

జగనన్నకు అండగా నిలుద్దాం



డక్కిలి: వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం

డక్కిలి: అన్ని వర్గాలవారికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పి.జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని వెంబులూరు, మిట్టవడ్డిపల్లి, రామాపురం, తోపుగానిపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే13 తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదరుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఎస్.వేణు నాయుడు, పి.రామాణావు, పోలయ్య, కె.కోటేశ్వరరావు, ఎం.నారాయణరెడ్డి, కె.వేణుగోపాల్, బండి రమేష్‌రెడ్డి, ఆర్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువలో వైఎస్సార్ సీపీ

– అట్టహాసంగా కార్యాలయాలు ప్రారంభం

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపి ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు కార్యాలయాలు ప్రారంభించినట్లు ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట, పాలకేంద్రం సెంటర్, రైల్వేస్టేషన్‌రోడ్డు కోళ్లఫారం సెంటర్, మల్లమ్మగుడి ప్రాంతం, పాతశివాలయం వీధి, ధర్మరాజుల స్వామి దేవస్థానం వీధి, పద్మశాలివీధిలో రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యాలయాలు ప్రారంభించి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గురుమూర్తిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

రామ్‌కుమార్‌రెడ్డితోనే అభివృద్ధి

వెంకటగిరి విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందాలంటే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని వెంకటగిరి రాజ కుటుంబీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు





బంగారు గరుడవాహనంపై శ్రీలక్ష్మీనరసింహ స్వామి, పెంచలకోన క్షేత్రంలో బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారు

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. 9 గంటలకు శ్రీవారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాన్ని బంగారు గరుడ వాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణతో కోన మాఢవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో పంచాంగ శ్రవణం, స్వామి అమ్మవార్ల కల్యాణం చేపట్టారు. నూతన సంవత్సరం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు కోనకు చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాపూరులోని రాపూరమ్మ, పర్వతవర్ధిని రామనాథేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, మద్దెలమడుగులోని కృష్ణమందిరం, అయ్యప్పమహావిష్ణు ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు.